సాక్షి
యాదాద్రి భువనగిరి
ఆదివారం । 29 । జూన్ । 2025



ఎంజీయూ ఒప్పందం
స్కిల్ డిజైనర్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ హైదరాబాద్‌తో ఎంజీ యూనివర్సిటీ ఒప్పందం చేసుకుంది.
- 8లో



బడిబాట పట్టించి..
ప్రభుత్వ బడుల బలోపేతానికి విద్యాశాఖ చేపట్టిన చర్యలు సత్ఫలితాలిస్తున్నాయి. విద్యార్థుల సంఖ్య పెరుగుతోంది.
- 9లో



సమస్యలకు పరిష్కారం
ప్రతిరోజూ వార్డుల్లో పర్యటించడం వల్ల సమస్యలను గుర్తించి పరిష్కరించవచ్చని అదనపు కలెక్టర్ అన్నారు.
- 9లో

న్యూస్‌రీల్

ఏసీపీగా విజయ్‌కుమార్

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయ ఏసీపీగా జి.విజయ్‌కుమార్‌ను నియమిస్తూ డీజీపీ శనివారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఏసీపీ సైదులు గతంలోనే బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో కరీంనగర్ సీసీఆర్‌బీలో ఏసీపీగా పనిచేస్తున్న విజయ్‌కుమార్‌ను నియమించారు. ఒకటి, రెండు రోజుల్లో విజయ్‌కుమార్ బాధ్యతలు స్వీకరించనున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

భువనగిరి : మండలంలోని అనంతారం పరిధిలో గల పూలే బీసీ బాలుర డిగ్రీ కళాశాలలో గెస్ట్ ఫ్యాకల్టీల నియామకానికి దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రిన్సిపాల్ స్వప్న శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులకు సంబంధించి వివిధ విభాగాల్లో ఖాళీ పోస్టులను భర్తీ చేస్తున్నట్లు తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు జూలై 3వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాల కోసం సెల్ నంబర్లు 9948984800, 7396121244ను సంప్రదించాలని కోరారు.

హెల్మెట్‌తో రక్షణ



సిబ్బందికి హెల్మెట్లు అందజేస్తున్న ఎస్ఈ

భువనగిరి : విధి నిర్వహణలో తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని విద్యుత్ శాఖ ఎస్ఈ సుధీర్‌కుమార్ సిబ్బందికి సూచించారు. సేఫ్టీ వారోత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో విద్యుత్ సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విధి నిర్వహణలో భాగంగా ప్రమాదకరమైన పనులు చేసే అవకాశం ఉంటుందని, అలాంటప్పుడు హెల్మెట్, హ్యాండ్ గ్లౌజ్‌లు తదితర రక్షణ కవచాలను ధరించాలని సూచించారు. అనంతరం సిబ్బందికి హెల్మెట్‌లు అందజేశారు.

టిప్పర్లకు జరిమానా



రాజాపేట : మండలంలోని చల్లూరు మల్ల్వాని చెరువునుంచి అనుమతి లేకుండా మట్టి తరలిస్తున్న టిప్పర్లకు లక్ష 22 వేల 866 రూపాయలు జరిమానా విధించారు. వారం రోజులుగా అనుమతి లేకుండా మల్లవాని చెరువునుంచి టిప్పర్ల ద్వారా అక్రమంగా మట్టి తరలిస్తున్నారు. 100 కాల్ ద్వారా అందిన ఫిర్యాదు మేరకు పోలీసులు దాడులు నిర్వహించి 23 టిప్పర్లను పట్టుకున్నారు. వాటిని మైనింగ్ అధికారులకు అప్పగించగా జరిమానా విధించారు. చెరువు నుంచి ఎంత మట్టి తరలించారన్న విషయాన్ని త్వరలో వెల్లడిస్తామని ఏడీ తెలిపారు.

ప్రతి దరఖాస్తునూ పరిశీలించాలి



చౌటుప్పల్‌లో సమీక్ష చేస్తున్న అదనపు కలెక్టర్

భువనగిరి, చౌటుప్పల్ : భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కారం చూపాలని అదనపు కలెక్టర్ వీరారెడ్డి ఆదేశించారు. శనివారం ఆయన భువనగిరి, చౌటుప్పల్ ఆర్డీఓ కార్యాలయాలను సందర్శించారు. ఆర్డీఓలు, తహసీల్దార్లు, డీటీలు, ఆర్ఐలతో సమావేశమై దరఖాస్తుల పరిష్కారంపై సమీక్షించారు. పాత రికార్డుల ఆధారంగానే దరఖాస్తులను పరిష్కరించాలని, తప్పులకు తావుండరాదన్నారు. సమావేశంలో ఆర్డీఓలు కృష్ణారెడ్డి, శేఖర్‌రెడ్డి, తహసీల్దార్లు శ్రీనివాస్‌రెడ్డి, వీరాభాయి, దశరథనాయక్, లాల్ బహదూర్‌సింగ్, శ్రీనివాస్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

టీజీఈఏపీ సెట్ కౌన్సిలింగ్ ప్రారంభం

రామగిరి(నల్లగొండ): ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలో ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు టీజీఈఏపీ సెట్ -2025 కౌన్సెలింగ్ శనివారం ప్రారంభమైంది. నల్లగొండలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల హెల్ప్‌లైన్ సెంటర్లో కౌన్సెలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ప్రిన్సిపాల్ నరసింహారావు తెలిపారు. ఎంపీసీ స్ట్రీమ్‌లో అర్హత సాధించిన విద్యార్థులకు మూడు విడతలుగా కౌన్సెలింగ్ ప్రక్రియ పూర్తి చేయనున్నట్లు తెలిపారు. కౌన్సెలింగ్‌కు హాజరయ్యే విద్యార్థులు టీజీఈఏపీ సెట్ ర్యాంక్ కార్డ్, సెట్ హాల్ టికెట్, ఎస్ఎస్‌సీ మెమో, ఇంటర్ మెమో, స్టడీ సర్టిఫికెట్స్, ఒరిజినల్ టీసీ, కుల ఆదాయ ధ్రువీకరణ పత్రాలు తీసుకోని రావాలన్నారు.



వైభవంగా జగన్నాథ రథయాత్ర

భువనగిరి : జిల్లా కేంద్రంలో శనివారం ఇస్కాన్ సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన జగన్నాథ రథయాత్ర కనుల పండువగా సాగింది. హైదరాబాద్ చౌరస్తా నుంచి రైల్వే స్టేషన్ వరకు యాత్ర నిర్వహించారు. దారి పొడవునా ప్రజలు, వివిధ పార్టీల నాయకులు యాత్రకు స్వాగతం పలికారు. కొందరు రథాన్ని లాగి భక్తిని చాటుకున్నారు. విదేశీయులు సైతం యాత్రలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఇస్కాన్ సంస్థకు నిర్వాహకులు మాధవ గోపిదాస్, స్వరూప సిద్ధిదాస్, విశ్వంభరదాస్, నాయకులు తంగళ్లపల్లి రవికుమార్, మాయ దశరథ, చందా మహేందర్ గుప్తా, బలరాం తదితరులు పాల్గొన్నారు.

జనగణనకు సన్నాహాలు

సిబ్బంది జాబితా, గ్రామాల వారీగా మ్యాప్‌లు రెడీ

- ఎన్యూమరేటర్లుగా ఉపాధ్యాయులు
- పర్యవేక్షణకు జిల్లా, మండల స్థాయిలో కమిటీలు
- త్వరలో హైదరాబాద్‌లో, జిల్లా పరిధిలోనూ శిక్షణ
- బ్లాక్‌లుగా ఇళ్ల విభజన
- 2027 మార్చి 1వ తేదీ నాటికి జనాభా లెక్కల సేకరణ



సాక్షి, యాదాద్రి: 16వ జనాభా లెక్కల సర్వేకు జిల్లా యంత్రాంగం సమాయత్తమవుతోంది. జనగణనకు సంబంధించి ఇటీవల కేంద్రం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లలో యంత్రాంగం నిమగ్నమైంది. ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లు, పర్యవేక్షణ అధికారుల నియామకం, సమకూర్చుకోవాల్సిన సామగ్రి తదితర అంశాలపై దృష్టి సారించింది. ఇప్పటికే సిబ్బంది నియామకం, గ్రామాల వారీగా మ్యాప్‌లు కొలిక్కి వచ్చాయి.

చివరి సారిగా 2011లో జనాభా లెక్కింపు

సాధారణంగా ప్రతి పదేళ్లకోసారి జనాభా లెక్కలు వెల్లడిస్తారు. చివరిసారి 2011లో జనగణన చేపట్టారు. నాటి లెక్కల ప్రకారం జిల్లా జనాభా 7,70,833 మంది ఉన్నారు. ఆ తరువాత 2021లో లెక్కించాల్సి ఉండగా కరోనా కారణం వల్ల ప్రక్రియ నిలిచిపోయింది. తాజాగా కేంద్రం జనగణన గెజిట్ విడుదల చేయడంతో జిల్లాలోనూ జనాభాను లెక్కించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. గతంలో పేపర్ ద్వారా జనగణన చేపట్టగా.. ఈసారి జిటల్ మొబైల్ యాప్ ద్వారా సర్వే చేయనున్నారు.

జిల్లా, మండల స్థాయిలో కమిటీలు

జనాభా లెక్కల సేకరణకు జిల్లా, మండల స్థాయిలో ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేయనున్నారు. కలెక్టర్, అదనపు కలెక్టర్(రెవెన్యూ), డీఆర్‌ఓ, చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్, మరికొందరు అధికారులతో జిల్లా కమిటీ ఉంటుంది. మండల స్థాయిలో తహసీల్దార్, ఏఎస్ఓ(అసిస్టెంట్ స్టాటిస్టికల్ అధికారి)తో కమిటీ ఉంటుంది. తహసీల్దార్ జనాభా లెక్కల సేకరణ అధికారిగా, ఏఎస్ఓ సహాయ అధికారిగా వ్యవహరిస్తారు.

జిల్లా స్వరూపం	
భౌగోళిక విస్తీర్ణం	3,795 కి.మీ
రెవెన్యూ గ్రామాలు	321
మండలాలు	17
మున్సిపాలిటీలు	06
పంచాయతీలు	428
మొత్తం జనాభా (2011 లెక్కల ప్రకారం)	7,70,833
పురుషులు	3,90,492
మహిళలు	3,80,341
గ్రామీణ జనాభా	6,47,668
పట్టణ జనాభా	1,23,165
నివాస గృహాలు	1,88,520

రెండు విడతల్లో లెక్కింపు

రెండు విడతల్లో జనాభా లెక్కించనున్నారు. మొదటి విడత 2025 అక్టోబర్ 1, రెండో దశ 2027 మార్చి1 నాటికి జనాభా లెక్కలు సేకరించనున్నారు. ఎన్యుమరేటర్లు ప్రతి ఇంటికి రెండుదఫాలు వెళ్తారు. మొదటి సారి ఇళ్లను లెక్కించడంతో పాటు కుటుంబ స్థితిగతులు, ఆస్తులు, ఆదాయం, వసతులు వంటి అంశాలను సేకరిస్తారు. రెండో దశలో జనాభా వివరాలు సేకరించేందుకు ఇంటింటికి వెళ్తారు. కుల, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక సమాచారం సేకరిస్తారు. ముఖ్య ప్రణాళిక, రెవెన్యూ, మున్సిపల్, పంచాయతీ శాఖల అధికారులు, ఎన్యూమరేటర్లు సేకరించి రూపొందించిన జాబితాల ఆధారంగా ప్రత్యేక కమిటీలు క్షేత్రస్థాయికి వెళ్లి నిర్ధారిస్తాయి.

డిజిటల్ మొబైల్ యాప్‌తో సర్వే

ఉపాధ్యాయులను ఎన్యూమరేటర్లుగా నియమించనున్నారు. ఐదుగురు ఎన్యూమరేటర్లకు ఒక సూపర్‌వైజర్ ఉంటాడు. వీరికి జిల్లా పరిధిలోనే వివిధ స్థాయిల్లో శిక్షణ ఇస్తారు. ఉన్నతస్థాయి కమిటీలకు హైదరాబాద్‌లో శిక్షణ ఉంటుంది.ఈసారి డిజిటల్ మొబైల్ యాప్‌ను జనాభా లెక్కల సేకరణకు వినియోగించనున్నారు.

అభివృద్ధికి దోహదం

పెరుగుతున్న పట్టణీకరణకు అనుగుణంగా శివారు ప్రాంతాలను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. మున్సిపాలిటీల శివారు ప్రాంతాలను గుర్తించి వాటిని విస్తరించేందుకు అనువైన పరిస్థితులను గుర్తించే ప్రక్రియ ఇప్పటికే మొదలైంది. వీటి అభివృద్ధికి జనాభా లెక్కలు దోహదపడనున్నాయి.



పోచంపల్లిలో సాగు న్యాయయాత్రలో పాల్గొన్న రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, సునీల్ తదితరులు

సాగు చట్టాలపై అవగాహన అవసరం

- రాష్ట్ర రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, భూ చట్టాల నిపుణుడు భూమి సునీల్
- లీఫ్స్ సంస్థ ఆధ్వర్యంలో సాగు న్యాయయాత్ర

భూదాన్‌పోచంపల్లి, చౌటుప్పల్, సంస్థాన్‌నారాయణపురం : సాగు చట్టాల గురించి రైతులకు తెలిసి ఉండాలని, వాటిపై అవగాహన కల్పించడమే సాగు న్యాయయాత్ర ప్రధాన ఉద్దేశమని తెలంగాణ రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి తెలిపారు. శనివారం భూదాన్‌పోచంపల్లిలోని వినోబాభావే మందిరం నుంచి లీఫ్స్ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు భూమి సునీల్ ఆధ్వర్యంలో సాగు న్యాయయాత్రకు శ్రీకారం చుట్టారు. యాదాద్రి జిల్లా పరిధిలో పోచంపల్లి, చౌటుప్పల్, సంస్థాన్‌నారాయణపురం మండలాల్లో యాత్ర కొనసాగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశాల్లో భూమి సునీల్‌తో కలిసి ఆయన మాట్లాడారు. పెరిగిన సాగు పెట్టుబడికి అనుగుణంగా దిగుబడి రాకపోవడంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. ముఖ్యంగా నకిలీ విత్తనాలు, ఎరువుల వాడకం వల్ల నష్టపోయినప్పుడు, పంటల బీమా వర్తించనప్పుడు చట్టాల ద్వారానే లబ్ధిపొందడం సాధ్యమవుతుందన్నారు. అందుకే సాగు చట్టాలపై ఎప్పటికప్పుడు అధ్యయనం చేస్తుండాలని రైతులకు సూచించారు. రైతు కుటుంబంలో జన్మించిన రేవంత్‌రెడ్డి.. రైతుల సంక్షేమానికి అనేక పథకాలను అమలు చేస్తున్నారని కొనియాడారు.

కార్యక్రమం ఏదైనాపోచంపల్లి నుంచే : సునీల్

తాను ఇప్పటి వరకు చేపట్టిన ప్రతి కార్యక్రమాన్ని భూదాన్‌పోచంపల్లి నుంచే ప్రారంభించానని లీఫ్స్ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు భూమి సునీల్ గుర్తు చేశారు. కేంద్ర, రాష్ట్ర పరిధిలో కలిపి భూమి, వ్యవసాయానికి సంబంధించి 174 చట్టాలు ఉన్నాయని, వీటిపై రైతులకు అవగాహన ఉండాలన్నారు.హైదరాబాద్‌లోని బాపుఘాట్ వద్ద అక్టోబర్ 2న యాత్ర ముగుస్తుందన్నారు. యాత్రలో తమ దృష్టికి వచ్చిన సమస్యలను ప్రభుత్వం ముందుంచుతామని చెప్పారు. హైకోర్టు, సుప్రీంకోర్టుకు నివేదిస్తామన్నారు.

భూదానస్థూపం వద్ద నివాళి

భూదాన్‌పోచంపల్లిలో ఆచార్య వినోబాభావే, వెదిరె రాంచంద్రారెడ్డి విగ్రహాలతో పాటు భూదానస్థూపం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. సాగు న్యాయయాత్ర కరపత్రాలను ఆవిష్కరించారు. రైతుల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జలాల్‌పురం గ్రామానికి చెందిన రైతు గోరంటి శ్రీనివాస్‌రెడ్డి లీఫ్స్‌సంస్థకు రూ.50వేల ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో రైతు కమిషన్ సభ్యుడు కేవీఎస్ రెడ్డి, భూదానయజ్ఞబోర్డు మాజీ అధ్యక్షుడు గున్నా రాజేందర్‌రెడ్డి, లీఫ్స్ సంస్థ ప్రతినిధులు జీవన్‌రెడ్డి, మల్లేశ్, అభిలాష్, రవి, ప్రవీణ్, గాంధీగ్లోబల్ ఫ్యామిలీ ప్రతినిధి యానాల ప్రభాకర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పాక మల్లేశ్, డీసీసీ ఉపాధ్యక్షులు కళ్లెం రాఘవరెడ్డి, సామ మధుసూధన్‌రెడ్డి, నర్సింహారెడ్డి, పీఏసీఎస్ వైస్‌చైర్మన్ సామ మోహన్‌రెడ్డి, ఏడీఏ వెంకటేశ్వర్‌రావు, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజు, మార్కెట్ వైస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, ఏఓ నాగరాజు, పీఏ సీఎస్ చైర్మన్ రఘుమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నారాయణపురంలో సమస్యల ఏకరువు

నారాయణపురంలోని సర్వే నంబర్ 255లోని అసైన్డ్ భూముల్లో తరాతరాలుగా సాగు చేసుకుంటున్నామని, పట్టాలు కూడా ఇచ్చారని, బ్యాంకు రుణాలు తీసుకున్నామని, అధికారులు తమకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా భూములను తిరిగి తీసుకునే ప్రయత్నం చేస్తున్నారని బాధిత రైతులు వాపోయారు. రాచకొండలోని రెవెన్యూ భూముల్లో ఎస్టీ, ఎస్సీ, బీసీ రైతులు సుమారు 3వేల మంది తరతరాలుగా సేద్యం చేసుకుంటున్నామని, అన్ని ఆధారాలున్నా ఆటవీ శాఖ అధికారులు తమను ఇబ్బంది పెడుతున్నారని, సాగు జూలాలు అందించేలా చర్యలు తీసుకోవాలని.. ఇలా వివిధ సమస్యలపై రైతులు, సీపీఐ నాయకులు విన్నవించినారు. ఈ కార్యక్రమంలో నీటి పోరాట నాయకుడు కేవీఎస్ రెడ్డి, గోవింద్, హరి, మల్లేష్, సీపీఐ మండల కార్యదర్శి దుబ్బక భాస్కర్, చిలుదేరు అంజయ్య, మందుగుల భాలకృష్ణ, ఏపూరి సతీష్, ధన్వంత్‌రెడ్డి పాల్గొన్నారు.



చౌటుప్పల్‌లో రైతులతో మాట్లాడుతున్న కోదండరెడ్డి, భూమి సునీల్

ఉపాధ్యాయురాలిపై ఐలయ్య ఆగ్రహం

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట పట్టణంలోని పాత గోశాల జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల తనిఖీకి వెళ్లిన ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్యకు చేదు అనుభవం ఎదురైంది. శనివారం మధ్యాహ్న సమయంలో పాఠశాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థులకు వండిన భోజనాన్ని పరిశీలించారు. భోజనం నాణ్యతగా ఉండటంలేదని, మెనూ అమలు చేస్తలేరని విద్యార్థులు ఐలయ్య దృష్టికి తీసుకెళ్లారు. దీంతో మధ్యాహ్న భోజన ఇంచార్జిగా ఉన్న ఉపాధ్యాయురాలు రాధికను పిలిపించారు. మెనూ ప్రకారం శనివారం మిక్స్‌డ్ కూరగాయలు ఉండాలని.. కానీ, ఎక్కువగా దోసకాయలు ఉండటం ఏమిటని ప్రశ్నించారు. అందుకు ఆమె ప్రభుత్వ విప్‌పైకి వేలు చూపుతూ.. భోజనం ఇట్లానే ఉంటదని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పింది. అవాక్కైన ఐలయ్య.. ఆమెపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే సంబంధిత ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై మధ్యాహ్న భోజన ఇంచార్జి టీచర్ రాధికను వివరణ కోరగా.. తనను మహిళ అని చూడకుండా అగౌరవపరిచేలా మాట్లాడారని చెప్పారు.



మెనూ అమలుపై ప్రభుత్వ విప్ ఐలయ్యకు సమాధానం ఇస్తున్న ఉపాధ్యాయురాలు

నేత్రపర్వంగా నిత్యకల్యాణం

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి దివ్యక్షేత్రంలో శనివారం సంప్రదాయ పూజల్లో భాగంగా నిత్యకల్యాణ వేడుకగా నేత్రపర్వంగా చేపట్టారు. ప్రభాతవేళ స్వామివారి మేల్కొలుపులో భాగంగా సుప్రభాత సేవ చేపట్టిన అర్చకులు.. గర్భాలయంలోని స్వయంభూలు, ప్రతిష్ఠా అలంకారమూర్తులను అభిషేకం, తులసీదళ అర్చనతో కొలిచారు. ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం ఆగమశాస్త్ర ప్రకారం నిర్వహించారు. అనంతరం అర్చకుల వేదమంత్రాలు, భాజాభజంత్రీల మధ్య నిత్యతిరుకల్యాణోత్సవం కనులపండువగా చేపట్టారు. అదే విధంగా బ్రహ్మోత్సవం, వెండి జోడు సేవల ఊరేగింపు తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వివిధ పూజల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి శయనోత్సవం చేసి ఆలయద్వార బంధనం చేశారు.

పెండింగ్ కేసులకు పరిష్కారం చూపండి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి జయరాజు

భువనగిరిటౌన్ : రాజీ పడదగిన కేసులతో పాటు ఇతర కేసులు త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ అధ్యక్షులు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జయరాజు ఆదేశించారు. శనివారం జిల్లా కోర్టులో జరిగిన జిల్లా స్థాయి కోఆర్డినేషన్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. పెండింగ్ కేసులు, నాన్ బెయిలబుల్ వారంట్లు తదితర అంశాలపై సమీక్షించి సూచనలు చేశారు. చిన్నచిన్న కేసులను త్వరగా పరిష్కరించడం వల్ల రాజీకి ఆమోదయోగ్యంకాని కేసులపై దృష్టి సారించవచ్చన్నారు. అనంతరం భువనగిరిలోని సబ్ జైల్‌ను ఆయన సందర్శించి ఖైదీలతో ముఖాముఖి సమావేశం అయ్యారు. న్యాయ సహకారం అవసరమైన ఖైదీలు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి ముక్తిదా, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి మాధవిలత, ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి ఉషశ్రీ, అదనపు డీసీపీ లక్ష్మీనారాయణ, ఏసీపీలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి

అరచేతిలో అందం.. ఆరోగ్యం..!

ఆషాఢ మాసంలో అతివల గోరింటాకు సందడి

- సౌభాగ్యానికి, శ్రేయస్సుకు సంకేతంగా భావిస్తున్న మహిళలు
- పట్టణాల్లోని కాలనీల్లో సామూహికంగా వేడుకలు
- గోరింటాకు పెట్టుకుని మురిసిపోతున్న అతివలు

సూర్యాపేట అర్బన్, రామగిరి(నల్లగొండ): ఆషాఢ మాసం వచ్చిందంటే చాలు అతివలకు గోరింటాకు గుర్తుకువస్తుంది. ఆషాఢం గడిచేలోగా ఏదో ఒక రోజున గోరింటాకు పెట్టుకొని తీరాలంటూ పెద్దలు చెబుతారు. అతివలకు ఆరోగ్యంతోపాటు ఆధ్యాత్మికాన్ని పెంపొందించే గోరింటాకు సందడి జిల్లాలో మొదలైంది. ఆషాఢంలో గోరింటాకు పెట్టుకోవడం సౌభాగ్యానికి, శ్రేయస్సుకు సంకేతంగా భావిస్తారు. గోరింటాకు మహిళల చేతులు, కాళ్లకు కొత్త అందాన్నిస్తుంది. యువతుల చేతికి గోరింటాకు ఎంత ఎర్రగా పండితే.. అంత మంచి భర్త దొరుకుతాడని విశ్వసిస్తారు. గోరింటాకు శుభానికి చిహ్నంగా భావిస్తారు.

అనేక ఔషధ గుణాలు

వేసవిలో మన శరీరం వేడితో కూడుకుని ఉంటుంది. ఆషాఢంలో బయటి వాతావరణం చల్లబడిపోతుంది. అలాంటి సమయంలో మన శరీరంలోని వేడి.. బయట చల్లబడిన వాతావరణానికి విరుద్ధంగా తయారవుతుంది. దీంతో అనారోగ్య సమస్యలు వస్తాయి. గోరింటాకుకు శరీరంలో ఉండే వేడిని తగ్గించే శక్తి ఉంటుంది. అంతేకాకుండా గోరింటాకు రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది. ఆషాడంలో గోరింటాకు తప్పకుండా పెట్టుకోవాలని డాక్టర్లు కూడా చెప్తున్నారు.





దోషాలను నివారిస్తుంది

గోరింటాకును శుభకార్యాలు, పండుగలప్పుడు పెట్టుకోవడం ఆనవాయితీ. కొన్ని సంప్రదాయాల ప్రకారం గోరింటాకు గర్భాశయ దోషాలను తొలగిస్తుందని, స్త్రీ ఆరోగ్యాన్ని కాపాడుతుందని నమ్ముతారు. ఆయుర్వేదంలో గోరింటాకు వేర్లు, బెరడు, ఆకులు, పూలు, విత్తనాలు అన్నీ ఔషధ గుణాలు కలిగి ఉన్నాయని చెబుతారు. ఆషాఢ మాసంలో గోరింటాకు పెట్టుకోవడం స్త్రీలకు సౌభాగ్యానికి చిహ్నంగా భావిస్తారు. ఇది స్త్రీ తత్వానికి, అందానికి ప్రతీక అని నమ్ముతారు. ఆషాఢంలో మహిళలు గోరింటాకు పెట్టుకోవడం ద్వారా సౌభాగ్యాన్ని పొందిన వారవుతారని జ్యోతిష్యులు అంటున్నారు.

ప్రయోజనాలు ఇలా..

- చర్మ వ్యాధుల నుంచి రక్షణ
- ఒంట్లోని వేడిని తగ్గించడం
- రోగనిరోధక శక్తిని పెంచడం
- రక్త ప్రసరణను మెరుగుపర్చడం
- గోళ్లను ఆరోగ్యంగా ఉంచడం

పట్టణాల్లో సామూహికంగా..

పట్టణాల్లో పలు కాలనీలలో మహిళలు ఒక చోట చేరి గోరంటాకు సేకరిస్తారు. సంప్రదాయ పద్ధతిలో రోలులో గోరంటాకును నూరుతారు. అంతా ఒకచోట సమూహంగా కూర్చొని పాటలు పాడుతూ ఒకరికొకరు గోరింటాకు పెట్టుకుంటారు.

ఆరోగ్యానికి ఎంతో మేలు



గోరింటాకు పెట్టుకోవడంతో అంటు రోగాలు దరికి చేరవు. గోరింటాకు శరీరాన్ని చల్ల పరచడానికి సహాయపడుతుంది. జ్వరం, తలనొప్పిని తగ్గిస్తుంది. జుట్టును రాలకుండా సంరక్షిస్తుంది. కేశాల పెరుగుదలకు సహాయపడుతుంది. చుండ్రును తొలగించేందుకు ఎంతగానో ఉపయోగపడుతుంది. రుతువు మారడంతో మహిళలు గోరింటాకు పెట్టుకోవడం ఆరోగ్యానికి మంచిది.

– డాక్టర్ పాల ఆనంద్, జనరల్ మెడిసిన్, సూర్యాపేట

గోరింటాకు సౌభాగ్యాన్ని గుర్తు చేస్తుంది



ఆషాఢంలో కొత్త పెళ్లి కూతుళ్లు తమ పుట్టింటికి చేరుకోవడం ఆనవాయితీ. ఆ సమయంలో తమ చేతులకు పండించుకునే గోరింట, వారికి తమ సౌభాగ్యాన్ని గుర్తు చేస్తుంది. పుట్టింట ఉన్న మనసు, మెట్టినింట ఉన్న భర్త ఆరోగ్యాన్ని కాంక్షిస్తుంది. వేళ్లకి గోరింట పెట్టుకోవడం వల్ల కంటికి నదరుగానే కాకుండా గోళ్ల పెళుసుబారిపోకుండా, గోరుచుట్టు వంటి వ్యాధులు రాకుండా ఉంటాయి.

– పద్మ, నల్లగొండ

శరీరాన్ని చల్లబరుస్తుంది



ఆషాఢం నాటికి వాతావరణం ఒక్కసారిగా చల్లబడిపోతుంది. వాతావరణంలో అకస్మాత్తుగా వచ్చే ఈ మార్పు వల్ల శరీరంలో పలు దోషాలు ఏర్పడతాయి. గోరింటాకు ఒంట్లోని వేడిని తగ్గిస్తుంది. అలా బయట వాతావరణానికి అనుగుణంగా మన శరీరాన్ని కూడా చల్లబరిచి దోషాలబారిన పడకుండా కాపాడుతుంది.

– సుజాత, నల్లగొండ

పూజలు, ఉపవాసాలు చేస్తారు



ఆషాడ మాసంలో శ్రీవారాహి అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు జూన్ 26 నుంచి జూలై 5 వరకు ఉండడంతో మహిళలు ఎంతో భక్తిశ్రద్ధలతో ఆరాధిస్తారు. సౌభాగ్యం కలకాలం నిలవాలని అమ్మవారికి రోజూ సాయంత్రం ప్రత్యేక, కుంకుమ పూజలు చేస్తుంటారు. ఉపవాస దీక్షలు చేపడతారు. గౌరీదేవిని పూజించి తమ చేతులు, కాళ్లకు గోరింటాకును అలంకరించుకుంటారు.

– మునగనేటి సంతోష్ శర్మ, ఎరుకేశ్వరాలయం ప్రధాన అర్చకుడు, పిల్లలమర్రి, సూర్యాపేట మండలం

క్లుప్తంగా

తప్పిపోయిన వృద్ధుడు కుటుంబ సభ్యులకు అప్పగింత



వృద్ధుడిని కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న పోలీసులు

నేరేడుచర్ల : తప్పిపోయిన వృద్ధుడిని పోలీసులు అతడి కుటుంబ సభ్యులకు శనివారం అప్పగించారు. నేరేడుచర్ల ఎస్సై రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. మోతె మండలం నామారం గ్రామానికి చెందిన గుణగంటి వెంకులు అనే వృద్ధుడు గరిడేపల్లి మండలం గడ్డిపల్లిలో ఉంటున్న తన కుమార్తె ఇంటికి వెళ్తుండగా మార్గమధ్యంలో తప్పిపోయాడు. నేరేడుచర్ల మండలం పెంచికల్‌దిన్న గ్రామంలో తిరుగుతుండగా గ్రామస్తులు పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించారు. ఆ వృద్ధుడిని తీసుకువచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

ఇస్రో శిక్షణ పూర్తి చేసుకున్న 'తేజ' విద్యార్థులు



శిక్షణ పొందిన తేజ విద్యాలయం విద్యార్థులు

కోదాడ : డెహ్రాడూన్‌లోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రిమోట్ సెన్సింగ్‌లో ఈ నెల 23 నుంచి 27 వరకు ఆ సంస్థ కార్యాలయం నిర్వహించిన అంతరిక్ష ఆధారిత ఇన్‌పుట్‌లపై శిక్షణను కోదాడ పట్టణ పరిధిలోని తేజ విద్యాలయంలో గత విద్యాసంవత్సరం పదో తరగతి చదివిన విద్యార్థులు సమజ్ఞ, శ్రీవల్లి పూర్తి చేశారు. ఈమేరకు పాఠశాల నిర్వాహకులు రమాసోమిరెడ్డి శనివారం తెలిపారు. ప్రతి సంవత్సరం దేశ వ్యాప్తంగా 100 మంది విద్యార్థులను ఈ శిక్షణకు ఎంపిక చేస్తారని పేర్కొన్నారు. వీరికి డెహ్రాడూన్‌లో శాటిలైట్లకు సంబంధించిన రిమోట్ సెన్సార్ల వ్యవస్థలపై జరుగుతున్న పరిశోధనలపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. విద్యార్థులకు అంతరిక్ష రంగం వైపు ఆసక్తిని కలిగించేందుకు ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు పాఠశాల నిర్వాహకులు పేర్కొన్నారు. కోదాడ నుంచి తమ పాఠశాల విద్యార్థులు ఎంపికై శిక్షణ పూర్తి చేసుకోవడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు.

స్కిల్ డిజైనర్ టెక్నాలజీతో ఎంజీయూ ఒప్పందం

- వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్



కంపెనీ ప్రతినిధులతో ఒప్పందం చేసుకుంటున్న వీసీ అల్తాఫ్ హుస్సేన్

నల్లగొండ టూటౌన్ : మహాత్మా గాంధీ యూనివర్సిటీ స్కిల్ డెవలప్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులు, అధ్యాపకుల నైపుణ్యాభివృద్ధికి స్కిల్ డిజైనర్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ హైదరాబాద్ వారితో ఒప్పందం చేసుకున్నట్లు వీసీ వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ తెలిపారు. శనివారం యూనివర్సిటీలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పోటీ ప్రపంచంలో నిలవాలని కోరారు. సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ.. ఈ ఒప్పందం ద్వారా ఎంజీ యూనివర్సిటీ కళాశాలలు, అనుబంధ కళాశాలల విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధికి శిక్షణ కార్యక్రమాలు ఉచితంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా విద్యార్థులకు, అధ్యాపకులకు ఉపయుక్తమైన నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను రూపకల్పన చేసినట్లు పేర్కొన్నారు. దీని ద్వారా ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్, ఇంటర్న్‌షిప్, వర్క్‌షాప్‌లు, అందించనున్నట్లు కంపెనీ ప్రతినిధులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంజీయూ రిజిస్ట్రార్ అలువాల రవి, ఐక్యూఏసీ డైరెక్టర్ మిర్యాల రమేష్, స్కిల్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ తిరుమల, వివిధ కళాశాలల కో ఆర్డినేటర్లు అభిలాష, స్వప్న, శ్రవణ్, అశ్విని, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆధునిక సాగు పద్ధతులతో అధిక దిగుబడులు



లింగాలలో సీడ్ కమ్ ఫర్టిలైజర్ మిషన్‌పై రైతులకు అవగాహన కల్పిస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

- కేవీకే శాస్త్రవేత్తలు నరేష్, కిరణ్

పెన్‌పహాడ్ : పంటల సాగులో ఆధునిక పద్ధతులు అవలంబించడం ద్వారా ఖర్చు తగ్గించుకుని అధిక దిగుబడులు సాధించవచ్చని కేవీకే శాస్త్రవేత్తలు నరేష్, కిరణ్ అన్నారు. శనివారం పెన్‌పహాడ్ మండలం లింగాలలో రైతు వెంకన్న వ్యవసాయ క్షేత్రంలో భారతీయ వరి పరిశోధన సంస్థ రాజేంద్రనగర్ హైదరాబాద్ ఆధ్వర్యంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సీఎస్ఆర్ ఫండ్ సహకారంతో దుక్కిలో నేరుగా వరి విత్తనాలు ఎదపెట్టే విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. వరిసాగులో నేరుగా విత్తనాలు ఎదపట్టే పద్ధతి వచ్చేసిందని, ఈ విధానం వైపు రైతులు మొగ్గు చూపుతున్నారన్నారు. వర్షాభావ పరిస్థితుల్లో సీడ్ కమ్ ఫర్టిలైజర్ మిషన్ ద్వారా నేరుగా విత్తనాలు నాటే విధానంతో రైతులకు ఎకరాకు రూ.6వేల నుంచి రూ.8వేలు ఆదా అవుతాయన్నారు. అదేవిధంగా చీడపీడల సమస్య, నీటి, కలుపు యాజమాన్య పద్ధతులను రైతులకు వివరించారు. కార్యక్రమంలో రైతులు మామిడి వెంకన్న, జ్యోతి, సర్వయ్య, హుస్సేన్, రవి, అరవింద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గంజాయి ముఠా అరెస్ట్

- నిందితుల వద్ద 2కేజీల 780గ్రాముల గంజాయి, స్కూటీ, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి

కోదాడరూరల్ : గంజాయి విక్రయిస్తున్న నలుగురు యువకులను శనివారం చింతలపాలెం మండలం దొండపాడులో పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి వెల్లడించారు. చింతలపాలెం మండలం గాంధీనగర్‌తండాకు చెందిన ముడావత్ అశోక్ అలియాస్ భూక్య అశోక్, చింతలపాలెం మండలం దొండపాడుకు చెందిన కొత్తపల్లి నాగార్జున, నంబూరి రత్నాకర్‌రెడ్డి, వేములనాగరాజు, కేతవరపు సాయి ఓ ముఠాగా ఏర్పడి ఏపీ నుంచి గంజాయిని తీసుకువచ్చి వారు కొంత సేవిస్తూ, మరికొంత విక్రయిస్తుండేవారు. ఈక్రమంలో ఈ నెల 21న అశోక్, సాయి కలిసి బైక్‌పై ఆంధ్రప్రదేశ్‌లోని అల్లూరిసీతారామరాజు జిల్లా సీలేరుకు వెళ్లి అక్కడ గుర్తు తెలియని వ్యక్తుల వద్ద రూ.12,500 చెల్లించి 5 కేజీల గంజాయిని కొనుగోలు చేసి ఈ నెల 23న దొండపాడుకు వచ్చారు. గంజాయిని గ్రామంలోని ఓ వ్యక్తి ఇంటి ఖాళీ స్థలంలో దాచి ఉంచి కొంత సేవించారు. మిగిలిన గంజాయిని పంచుకునేందుకు అక్కడకు వెళ్లగా పోలీసులకు అందిన సమాచారంతో నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. సాయి పోలీసులను గమనించి అక్కడి నుంచి బైక్‌పై పరారయ్యాడు. నిందితుల వద్ద 2కేజీల 780 గ్రాముల గంజాయి, స్కూటీ, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. రూరల్ సీఐ రజితారెడ్డి, చింతపాలెం ఎస్ఐ సందీప్‌రెడ్డి, సిబ్బంది లింగరాజు, భాస్కర్, అమృతయ్య, కవిరాజు, శ్రీకాంత్‌లను డీఎస్పీ అభినందించారు.

మినీ శిల్పారామంలో చిన్నారుల నృత్య ప్రదర్శన

భువనగిరి: భువనగిరి మండలం రాయగిరి గ్రామంలోని పెద్ద చెరువు సమీపంలో గల మినీ శిల్పారామంలో శనివారం సాయంత్రం చిన్నారులు కూచిపూడి నృత్య ప్రదర్శన చేశారు. చిన్నారుల నృత్యం భక్తులతో పాటు సందర్శకులను ఎంతగానో ఆకట్టుకుంది.



కూచిపూడి నృత్య ప్రదర్శన చేస్తున్న చిన్నారులు

ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయలేదని..



వెంకటాపురంలో వాటర్ ట్యాంకు ఎక్కి నిరసన తెలుపుతున్న యువకుడు మత్స్యగిరి

వలిగొండ : భువనగిరి జిల్లా వలిగొండ మండలంలోని వెంకటాపురం గ్రామానికి చెందిన యువకుడు బొడ్డు మత్స్యగిరి తనకు ఇందిరమ్మ ఇల్లు రాలేదని వాటర్‌ట్యాంకు ఎక్కి నిరసన వ్యక్తం చేశాడు. నిరుపేదనైన తనకు ప్రభుత్వం నుంచి ఇల్లు మంజూరు చేయలేదని, జాబితాలో తన పేరు లేదని మనస్తాపంతో శనివారం గ్రామంలో వాటర్ ట్యాంకు ఎక్కాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఆ గ్రామానికి వెళ్లి అతడికి నచ్చజెప్పారు. అధికారులతో ఇల్లు మంజూరు చేయిస్తామని స్థానిక ఎస్సై యూగంధర్ చెప్పారు. అనంతరం ఆ యువకుడు వాటర్ ట్యాంకు దిగి వచ్చాడు.

టీచర్ టు ఎస్పీ

- మొదటి ప్రయత్నంలోనే గ్రూప్ -1 సాధించా
- బాధితులకు సేవ చేయడంలోనే సంతృప్తి
- చట్టాలపై అవగాహన కల్పించేందుకే 'పోలీస్ ప్రజా భరోసా'
- గంజాయి, డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చేందుకు కృషి
- సూర్యాపేట ఎస్పీ కె.నర్సింహ



సూర్యాపేట ఎస్పీగా పనిచేస్తున్న కె.నర్సింహ ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని ఉన్నత చదువు అభ్యసించారు. చండూరు మండలంలో ప్రభుత్వ టీచర్‌గా పనిచేస్తూనే మొదటి ప్రయత్నంలోనే గ్రూప్ -1 సాధించారు. ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించేందుకు పోలీస్ ప్రజా భరోసా కార్యక్రమం విజయవంతంగా నిర్వహిస్తున్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తున్నారు. – సూర్యాపేటటౌన్

స్ఫూర్తి

'సమాజంలో నా వంతుగా మార్పు తీసుకురావాలనేదే కోరిక. మొదటగా ప్రభుత్వ ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న నేను పోలీస్ శాఖ వైపు అడుగులు వేయాల్సి వచ్చింది. ప్రజలకు మరింత సేవ చేయాలనే ఉద్దేశంతోనే గ్రూప్ -1 సాధించా. సూర్యాపేట జిల్లాను ఆదర్శంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తున్నా' అని ఎస్పీ కొత్తపల్లి నర్సింహ తెలిపారు. పోలీస్ శాఖలో వివిధ హోదాల్లో పని చేసి ఎస్పీ స్థాయికి చేరుకున్న ఆయన తన అనుభవాలను 'సాక్షి'తో పంచుకున్నారు

నేను రైతు బిడ్డనే..

మాది నల్లగొండ జిల్లా, చండూరు మండలం, కొండాపూర్ గ్రామం. తల్లిదండ్రులు వ్యవసాయం చేసేవారు. నాకు కూడా వ్యవసాయం అంటే అమితమైన ప్రేమ. నేను ఒక రైతు బిడ్డనే. అందుకే మా గ్రామంలో నాకున్న ఎనిమిది ఎకరాల్లో ఆయిల్ పామ్ తోట సాగు చేస్తున్నా. మూడేళ్ల క్రితం ఆయిల్‌పామ్ సాగు మొదలు పెట్టాను. ప్రస్తుతం ఆయిల్ పామ్ క్రాప్‌కు వచ్చింది. ప్రతినెలా రూ.50వేల వరకు ఆదాయం వస్తుంది. రైతులు కూడా ఇలాంటి పంటల వైపు మొగ్గు చూపాలి. ఇలాంటి పంటలు వేసుకుంటే చీడపీడల బెడద ఉండకుండా అధిక దిగుబడులు వచ్చే అవకాశం ఉంటుంది.



తన ఆయిల్‌పామ్ తోటలోని గెలలను తీసుకువస్తున్న ఎస్పీ కె.నర్సింహ (ఫైల్)

నకిలీ విత్తనాలపై నిరంతరం నిఘా

ప్రస్తుతం రైతులు విత్తనాలు విత్తే సమయం కావడంతో నకిలీ విత్తనాలు విక్రయించే వారిపై నిఘా పెట్టాం. రైతులు వ్యవసాయ అధికారులు సూచించిన విత్తనాలనే కొనుగోలు చేయాలి. ఇటీవల నకిలీ విత్తనాలు విక్రయిస్తున్న ముఠాలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించాం. 25క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తనాలు, 330 క్వింటాళ్ల వరి నకిలీ విత్తనాలు సీజ్ చేశాం. మార్కెట్‌లో గడ్డి మందులు తట్టుకునే విత్తనాలంటూ మోసం చేస్తున్నారు. అలాంటివి రైతులు నమ్మి మోసపోవద్దు.

బైండోవర్ ఉల్లంఘిస్తే పీడీ యాక్ట్

గ్రామాల్లో అలజడి సృష్టించే వారిని బైండోవర్ చేస్తాం. వారు బైండోవర్ నిబంధనలు అతిక్రమించి ఘర్షణలకు దిగితే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు పీడీ యాక్ట్ నమోదు చేస్తాం. ఇటీవల నూతనకల్ మండలం మిర్యాలలో బైండోవర్ నిబంధనలు ఉల్లంఘించి హత్యకు పాల్పడిన ఇద్దరిపై పీడీ యాక్ట్ నమోదు చేయడంతో పాటు ఒక్కొక్కరికి నుంచి రూ.లక్ష పూచీకత్తు వసూలు చేసి ప్రభుత్వ ఖాతాలో జమచేశాం.

గంజాయి, డ్రగ్స్ అరికట్టడంపై దృష్టి

గంజాయి, డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మార్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. సూర్యాపేట జిల్లాను గంజాయి, డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దుతాం. పాత నేరస్తులపై నిరంతరం నిఘా ఉంటుంది. డ్రగ్స్, గంజాయి తీసుకొచ్చే వారిపై నిఘా ఏర్పాటు చేసి చర్యలు తీసుకుంటాం. జిల్లాలో డ్రింకెన్ డ్రైవ్ తనిఖీలు నిరంతరం నిర్వహిస్తున్నాం. డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడితే జరిమానాతో పాటు జైలు శిక్ష ఉంటుంది.

పోలీసులు చట్ట పరిధిలోనే చర్యలు తీసుకోవాలి

జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లలో పోలీసులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తే ఊరుకునేది లేదు. చట్ట పరిధిలోనే చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలి. పోలీస్‌స్టేషన్‌కు ఫిర్యాదు చేసేందుకు వచ్చే బాధితుల పట్ల మర్యాదగా ప్రవర్తించి భరోసా కల్పించాలి. పోలీస్ వ్యవస్థపై ప్రజలకు నమ్మకం కలిగేలా వ్యవహరించాలి.

ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించేందుకు 'పోలీస్ ప్రజా భరోసా'



గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రతి ఒక్కరినీ సన్మార్గంలో నడిపించాలనే లక్ష్యంతో ప్రతి బుధవారం ఎనిమిది గ్రామాల్లో పోలీస్ ప్రజా భరోసా కార్యక్రమం నిర్వహిస్తున్నాం. ప్రతిఒక్కరూ చట్టానికి లోబడి నడుచుకునేలా చట్టాల గురించి ఈ కార్యక్రమంలో వివరిస్తున్నాం. పోలీసులు మీ భద్రత కోసం ఉన్నారని, ఇతరుల ఆస్తులపై దాడులు చేయొద్దని వివరిస్తున్నాం. గ్రామాల్లో అలజడి వాతావరణం, సమస్యలు సృష్టించే వారిలో మార్పు తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నాం. ప్రస్తుతం ఈ కార్యక్రమం సూర్యాపేట జిల్లాలో విజయవంతంగా కొనసాగుతోంది.

అయ్యో నర్సింహ.. పైసలు అడుక్కొచ్చుకుందాం లే..



నర్సింహ మృతదేహం వద్ద రోదిస్తున్న భిక్షాటన చేసే మహిళ



భువనగిరిటౌన్ : భువనగిరి బస్టాండ్‌లో భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్న వ్యక్తి అనారోగ్యంతో శనివారం బస్టాండ్ ఆవరణలో మృతి చెందాడు. భువనగిరి పట్టణ ఎస్సై లక్ష్మీనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. భువనగిరి పట్టణంలోని తాతానగర్‌లో ఉంటూ ప్రతి రోజు బస్టాండ్ గేటు వద్ద భిక్షాటన చేస్తున్న బోదాసు నర్సింహ(40) గత నాలుగు రోజులుగా జ్వరంతో బాధపడుతూ సులభ్ కాంప్లెక్స్ వద్ద మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఏరియా ఆస్పత్రికి తరలించారు. అనంతరం వారి బంధువులకు అప్పగించారు. మృతుడి తండ్రి బోదాసు యాదగిరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కాగా.. నర్సింహ మృతి చెందడంతో బస్టాండ్‌లో భిక్షటన చేస్తున్న ఓ మహిళ 'లేవు నర్సింహ శనివారం ఉంది.. పైసలు వేస్తారు' అంటూ రోదిస్తుండడంతో అక్కడ ఉన్న ప్రయాణికులు కన్నీటిపర్యంతం అయ్యారు.

గేదెలను తప్పించబోయి అదుపుతప్పిన బైక్

- యువకుడు మృతి.. మరో ఇద్దరికి తీవ్రగాయాలు

మరిపెడ రూరల్: సినిమా చూసేందుకు ముగ్గురు స్నేహితులు ఒకే బైక్‌పై వస్తుండగా మార్గమధ్యంలో గేదెలను తప్పించపోయి బైక్ అదుపు తప్పి కిందపడింది. ఈ ప్రమాదంలో యువకుడు మృతిచెందగా, మరో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం గిరిపురం క్రాస్ రోడ్డు సమీపంలోని పత్తి మిల్లు వద్ద శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. నూతనకల్ మండలం బిక్కుమళ్ల గ్రామానికి చెందిన గజేంద్రి గణేశ్ (23) కుక్కల గణేశ్, బాల్ని గణేశ్‌లు స్నేహితులు. సినిమా చూడడానికి ముగ్గురు ఒకే బైక్‌పై మరిపెడ మండల కేంద్రానికి వస్తున్నారు. ఈ క్రమంలో గిరిపురం క్రాస్ సమీపంలోని పత్తి మిల్లు వద్ద గేదెల మంద ఒక్కసారిగా రోడ్డుపైకి వచ్చింది. వాటిని తప్పించబోయి బైక్ అదుపుతప్పి పడిపోయింది. బైక్ నడుపుతున్న గజేంద్రి గణేశ్‌తోపాటు మిగతా ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఖమ్మంలోని ఓ ఆస్పత్రికి తరలిస్తుండగా గజేంద్రి గణేశ్ మార్గమధ్యంలో మృతిచెందాడు. మిగతా ఇద్దరు చికిత్స పొందుతున్నారు. మృతుడి తల్లి సుశీల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వ్యక్తిని చంపేందుకు రెక్కీ


సూర్యాపేటటౌన్ : ఓ వ్యక్తిని హత్య చేసేందుకు గ్యాంగ్ రెక్కీ నిర్వహిస్తుండగా గ్రామస్తులకు పట్టుబడ్డారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు అక్కడకు చేరుకుని నిందితులను అరెస్ట్ చేశారు. సీఐ రాజశేఖర్ కేసు వివరాలను వెల్లడించారు. మోతె మండలం రాఘవపురంలో నల్లగొండకు చెందిన వంగాల కిరణ్‌గౌడ్ క్రషర్ మిల్లు నిర్వహిస్తున్నాడు. అతడి మిల్లు పక్కన రాఘవపురం గ్రామానికి చెందిన పజ్జూరి వెంకటేశ్వర్లుకు మూడెకరాల భూమి ఉంది. ఆ భూమిని కిరణ్‌గౌడ్ ఆక్రమించాలనే ఉద్దేశంతో పలుమార్లుగా పజ్జూరి వెంకటేశ్వర్లును బెదిరించాడు. అయినా భూమిని ఇచ్చేందుకు వెంకటేశ్వర్లు ఒప్పుకోకపోవడంతో అతడిని చంపేందుకు పథకం రచించాడు. కిరణ్‌గౌడ్ నార్కట్‌పల్లి మండలం యల్లారెడ్డిగూడెం గ్రామానికి చెందిన మేడి శివప్రసాద్, బొడ్డుపల్లి స్వామి, గంగాదేవి నరసింహ, బరిగెల శివవంకర్, మాదగాని రమేష్, బొజ్జ చందుతో మాట్లాడి రూ.లక్ష సుపారీ ఇచ్చాడు. వెంకటేశ్వర్లు మెకానిక్‌గా పనిచేస్తున్న సూర్యాపేట పట్టణంలోని ట్రాక్టర్ షోరూం వద్ద నిందితులు ఆరు రోజులుగా రెక్కీ నిర్వహిస్తున్నారు. శుక్రవారం రాత్రి నిందితులు కారులో రాగా చుట్టుపక్కల వారు చూడటంతో పరారయ్యేందుకు ప్రయత్నించారు. స్థానికులు వారిని పట్టుకుని కారు డిక్కీ ఓపెన్ చేసి చూశారు. అందులో కర్రలు, బీరు సీసాలు ఉండటాన్ని చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు అక్కడికి చేరుకొని కారుతో సహా ఐదుగురు నిందితులను పట్టుకొని స్టేషన్‌కు తరలించారు. విచారణ చేయగా సుపారీ బాగోతం బయటపడింది. ఐదుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. మరో ఇద్దరు నిందితులైన కిరణ్‌గౌడ్, చందు పరారీలో ఉన్నట్లు చెప్పారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి

పెద్దవూర: బైక్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన శనివారం పెద్దవూర మండల పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాయినవానికుంట గ్రామానికి చెందిన మేకల శంకర్ (40) శనివారం తన బైక్‌పై పనిమీద పెద్దవూర మండల కేంద్రానికి వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో మండల కేంద్రంలోని నాయినివానికుంట స్టేజీ సమీపంలో ఉన్న వైన్స్‌కు వెళ్లాడు. అక్కడి నుంచి తన బైక్‌పై ఇంటికి వెళ్తుండగా హైదరాబాద్– నాగార్జునసాగర్ ప్రధాన రహదారి దాటుతుండగా అదేసమయంలో గుంటూరు నుంచి మహబూబ్‌నగర్‌కు వెళ్తున్న మహబూబ్‌నగర్ డిపో ఆర్టీసీ బస్సు బైక్‌ను ఢీకొట్టి, బైక్‌తో పాటు శంకర్‌ను 50 అడుగుల మేర ఈడ్చుకుంటూ వెళ్లింది. దీంతో శంకర్ తలకు తీవ్రగాయాలు కాగా నడుం నుంచి కింది భాగం ఛిద్రమై అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నాగార్జునసాగర్‌కు తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు.

స్వర్ణగిరీశుడికి తిరువీధి ఉత్సవ సేవ

భువనగిరి: భువనగిరి పట్టణ శివారులోని స్వర్ణగిరి క్షేత్రంలో ఉన్న వేంకటేశ్వర స్వామి దేవాలయంలో శనివారం సాయంత్రం స్వామి వారికి తిరువీధి ఉత్సవ సేవ నిర్వహించారు. అంతకు ముందు ఆలయంలో స్వామి వారికి ఉదయం సుప్రభాత సేవ, తోమాల సేవ, సహస్రనామార్చన, నిత్య కల్యాణ మహోత్సవం జరిపించారు. జల నారాయణ స్వామికి మంగళహారతులు సమర్పించారు.



జల నారాయణ స్వామికి మంగళహారతి సమర్పిస్తున్న అర్చకులు

ఏసీబీకి చిక్కిన భూ భారతి ఆపరేటర్

- రూ.12 వేలు లంచం తీసుకుంటుండగా పట్టుకున్న అధికారులు

హుజూర్‌నగర్ : వారసత్వ భూమికి సంబంధించి ప్రొసీడింగ్ పత్రాలను అందించేందుకు హుజూర్‌నగర్ తహసీల్దార్ కార్యాలయంలోని భూ భారతి (అవుట్‌సోర్సింగ్) ఆపరేటర్ లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. హుజూర్‌నగర్‌లో శనివారం నల్లగొండ ఏసీబీ డీఎస్పీ జగదీష్ చందర్ తెలిపిన వివరాల ప్రకారం.. కరక్కాయలగూడెం గ్రామానికి చెందిన రైతుకు అతడి తండ్రి నుంచి వారసత్వంగా వచ్చిన భూమిని కుటుంబ సభ్యుల పేరు మీద మ్యుటేషన్ చేయించి ప్రొసీడింగ్ పత్రాలను అందించే విషయంలో భూ భారతి ఆపరేటర్ విజేతారెడ్డి రూ. 20 వేలు డిమాండ్ చేశాడు. ఆతర్వాత ఎకరానికి రూ.వెయ్యి చొప్పున రూ.12 వేలు ఇవ్వాలని ఒప్పదం కుదుర్చుకున్నాడు. దీంతో సదరు రైతు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఈనేపథ్యంలో శనివారం తహసీల్దార్ కార్యాలయంలో విజేతారెడ్డి రూ.12 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. అతడి వద్ద రూ.12 వేలు స్వాధీనం చేసుకుని అతడిని అదుపులోకి తీసుకుని విచారించినట్లు ఏసీబీ డీఎస్పీ తెలిపారు. కార్యాలయ రికార్డులను, కంప్యూటర్లను పరిశీలించినట్లు ఆయన తెలిపారు. ఈ కేసుకు సంబంధించి అధికారుల పాత్ర ఉందా అనేది విచారణలో తేలుతుందని చెప్పారు. నిందితుడిని హైదరాబాద్‌లోని నాంపల్లిలో గల ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానం ఎదుట హాజరు పరచనున్నట్లు పేర్కొన్నారు.



ఏసీబీకి పట్టుబడిన విజేతారెడ్డి